క్లుప్తంగా

పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి



మాట్లాడుతున్న కో-కన్వీనర్ సత్తి రెడ్డి

చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మండల నూతన కో- కన్వీనర్ సత్తిరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం నేమకల్లులో మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి కో-కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షికి ధన్యవాదాలు తెలిపారు. నాయకులు దివాకర్ రెడ్డి, సురేష్ రెడ్డి, ప్రేమ్ కుమార్, గురుదాస్, పద్మనాభ రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ అలవర్చుకోవాలి



ఆస్పరిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ హనుమంతప్ప

ఆస్పరి: ప్రతిఒక్కరూ సామాజిక సేవ అలవర్చుకోవాలని ఆస్పరి సీఐ హనుమంతప్ప అన్నారు. ఆదివారం ఆస్పరిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సీఐ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవిలో వివిధ గ్రామాల నుంచి పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, సుధాకర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ



ప్రణీత్‌దీక్షిత్ నాయక్

తుగ్గలి: మండల పరిధిలోని లక్ష్మీతండాకు చెందిన రమావత్ సాలమ్మ కుమారుడు ప్రణీత్‌దీక్షిత్ నాయక్ నవోదయ, సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. తండాలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరచారు. నవోదయ ప్రవేశ పరీక్షలో 93.72/100, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో 230/300 మార్కులు సాధించి ప్రవేశానికి ఎంపికయ్యారు. ప్రతిభ చాటిన విద్యార్థిని సర్పంచ్ బనావత్ లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, హెచ్‌ఎం చంద్రమోహన్ యాదవ్, తదితరులు అభినందించారు.

9 నుంచి ఉగాది మహోత్సవాలు



నెట్టికంటి ఆంజనేయస్వామి

మద్దికెర: మండల కేంద్రానికి 7 కి.మీ దూరం లోఉన్న అనంతపురం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో 9వ తేదీ నుంచి ఉగాది మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ వై.భద్రాజీ, ఏఈఓ మఠం మల్లికార్జున ఆదివారం తెలిపారు. 9న గ్రామోత్సవం, 10న రథోత్సవం, 11న లంకాదహనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 17న శ్రీరామనవమి పురస్కరించుకొని సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

వైఎస్ జగనన్నతోనే సంక్షేమ పాలన



రాయచోటిలో ప్రచారం చేస్తున బుట్టా ప్రతుల్

నందవరం: సంక్షేమ పాలన కొనసాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా ప్రతుల్ పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా ఆయన మండలంలోని రాయచోటి, పొనకలదిన్నె గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. అధికార దాహంతో టీడీపీ నాయకులు చెప్పే మోసపూరిత హామీలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, నాయకులు విరుపాక్షిరెడ్డి, రమేష్‌గౌడ్, వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజు, తాయన్న, వీరస్వామి, భీరప్ప, పావని, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచ్చులో ఇరుక్కున్న మహిళ కాలు

తుగ్గలి: మండల పరిధిలోని గిరిగెట్ల సమీపంలో అడవి జంతువులు రాకుండా ఏర్పాటు చేసి కత్తెర ఉచ్చులో ఓ మహిళ కాలు ఇరుక్కుంది. కట్టెల కోసం వెళుతున్న ఓ మహిళ పొలంలో ఏర్పాటు చేసిన ఉచ్చును గమనించక కాలు పెట్టింది. వెంటనే కాలు పట్టేయడంతో కేకలు వేసింది. గమనించిన స్థానికులు వచ్చి ఉచ్చును తొలగించడంతో మహిళ ప్రమాదం నుంచి బయటపడింది.

అక్కా చెల్లెమ్మలకు అభయం

- నాడు రుణమాఫీపై మాట తప్పిన చంద్రబాబు
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్
- మహిళా స్వయం సహాయక సంఘాల రుణాలు మాఫీ
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు





నాడు - టీడీపీ హయాంలో రుణమాఫీ చేయాలంటూ ధర్నా చేస్తున్న పొదుపు మహిళలు, నేడు - వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందుకుంటున్న మహిళలు (ఫైల్)

ఆస్పరి: ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అందరి వల్ల కాదు. ఒక్కసారి మాట ఇచ్చి తప్పితే అలాంటి వారి మాటలను ప్రజలు ఇంకోసారి నమ్మరు. వారి మాటకు విలువ ఉండదు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి వారితో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చారు. అయితే ఇచ్చిన మాట ప్రకారం రుణాలు మాఫీ చేయలేదు. దీంతో చంద్రబాబునాయుడుపై అప్పట్లో పొదుపు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శాపనార్థాలు పెట్టారు. అంతేగాకుండా 2014 సెప్టెంబర్ 15న 'పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేయలని' డిమాండ్ చేస్తూ మండలంలోని వందలాది మంది పొదుపు మహిళలు ఆస్పరి ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా, ముట్టడి కార్యక్రమం చేపట్టి అప్పటి ఎంపీడీఓ శ్యామలకు వినతిపత్రం ఇచ్చారు.

బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మహిళలు నెల నెలా సక్రమంగా కంతులు చెల్లించడంతో పాటూ కొంత సొమ్ము పొదుపు చేస్తున్న నేపథ్యంలో రుణాలు మాఫీ చేస్తాననే చంద్రబాబు హామీని నమ్మి చాలామంది బ్యాంకుల్లో నెలవారీ కంతులు కట్టడం మానేశారు. పొదుపు మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడలేదు. పొదుపు రుణాలు మాఫీ చేయకుండా వారిని నట్టేట ముంచారు. దీంతో బ్యాంకుల్లో తీసుకున్న రుణం, వడ్డీ చెల్లించాలని అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయి. తప్పనిసరి పరిస్థితుల్లో పొదుపు మహిళలు ఆస్తులను అమ్ముకుని బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను కట్టాల్సివచ్చింది. 2019 ఎన్నికల్లో వైఎస్ జగనమోహన్ రెడ్డి పొదుపు సంఘాల రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం అధికారం చేపట్టగానే వైఎస్సార్ ఆసరా పథకం ప్రవేశపెట్టి నాలుగు విడతల్లో పొదుపు సంఘాల రుణాలను మాఫీ చేశారు. దీంతో పొదుపు మహిళల ఆనందానికి అవధులు లేవు. హామీ నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం, ఆలయాల్లో పూజలు చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నాలుగు విడతల్లో 11-09-2020 నుంచి 23-01-2024 వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాఫీ చేసిన పొదుపు రుణాల వివరాలు.. ఆరు మండలాల్లో మొత్తం 2,703 పొదుపు సంఘాలు ఉండగా 26,714 మంది సభ్యులు రుణమాఫీకి అర్హత పొందారు. వీరందరికీ 2019 ఎన్నికల నాటికి బ్యాంకుల్లో ఉన్న రుణాలు రూ.51.67 కోట్లను మాఫీ చేసి అండగా నిలిచారు.

మండలం	పొదుపు సంఘాలు	సభ్యుల సంఖ్య	రుణామాఫీ అయినమొత్తం (రూ.కోట్లలో)
ఆస్పరి	384	3946	6.35
ఆలూరు	620	6111	12.17
చిప్పగిరి	464	4517	11.99
హాలహర్వి	419	3973	10.83
హొళగుంద	199	2017	2.60
దేవనకొండ	627	6150	7.71
మొత్తం	2703	26714	రూ.51.67 కోట్లు

మాట నిలబెట్టుకున్నారు



ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగనన్న పొదుపు సంఘాల రుణాలను మాఫీ చేశారు. మా గ్రూపునకు నాలుగు విడతల్లో రూ.3 లక్షలు రుణ మాఫీ అయ్యింది. రుణం ఎలా తీర్చాలో ఆవేదనకు గురయ్యాం. జగనన్న రుణమాఫీ చేయడంతో చాలా సంతోషంగా ఉంది. గతంలో చంద్రబాబు రుణమాఫీ చేస్తానని చెప్పి చేయలేదు. జగనన్న మాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. **– మహబూబీ, మారుతి పొదుపు గ్రూపు, ఆస్పరి**

మా గ్రూపునకు రూ.3 లక్షలు మాఫీ అయ్యింది



వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా నాలుగు విడతల్లో మా గ్రూపునకు రుణమాఫీ కింద రూ.3 లక్షలు అందాయి. పొదుపు మహిళలను ఈ పథకం ఆర్థికంగా ఆదుకుంది. జగనన్న పాలనలో నాకు రుణ మాఫీతో పాటు మా కుటుంబంలో అమ్మ ఒడి, రైతు భరోసా, ఇంటి పట్టా కూడా వచ్చాయి. వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మహిళలు జీవనోపాధి ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. **– లక్ష్మిదేవి, మారెమ్మవ్వ గ్రూపు సభ్యురాలు, జొహరాపురం**

పొదుపు మహిళలకు న్యాయం చేశారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొదుపు మహిళలకు రుణమాఫీ చేసి న్యాయం చేశారు. మా విరాట్ గ్రూపునకు వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగేళ్లలో రూ.5 లక్షలు రుణమాఫీ అయ్యింది. రుణమాఫీతో మాకు ఎంతో మేలు జరిగింది. ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ లబ్ధితో పండ్ల వ్యాపారం పెట్టుకున్నా. కుటుంబానికి చేయూతగా నిలవడం సంతోషంగా ఉంది. **– చంద్రకళ, ఆస్పరి గ్రామం**

అవార్డు గ్రహీతకు సన్మానం



రిటైర్డ్ ఎంఈఓ రాజరత్నంను సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: మిర్యాలగూడలో ఈనెల 2వ తేదీన నిర్వహించిన నందిని జాతీయ నాటక పోటీల్లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన వైఎస్సార్ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ ఎంఈఓ రాజారత్నంకు ఉత్తమ జ్యూరీ అవార్డు దక్కింది. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో కర్నూలు లలిత కళాసమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య దర్శకత్వంలో మిర్యాలగూడలో ప్రదర్శించిన శ్రీ కర్ణార్జునీయం నాటక ప్రదర్శనలో పరుశురాం పాత్ర ప్రదర్శించిన ఆయనకు అక్కడి జాతీయ సాంస్కృతిక కళాభారతి సంస్థ నిర్వాహకులు జ్యూరీ అవార్డును ప్రదానం చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అవార్డు గ్రహీతను ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక శాలువా కప్పి సత్కరించారు. నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా రంగయ్య, శివప్రసాద్, సుధాకర్, రుద్రాక్షాల బజారి, కళాకారుల బృంద సభ్యులు మద్దిలేటి, శ్రీనివాసులు తదిరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ గడువు పొడిగింపు

మద్దికెర: ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్ల పంపిణీ గడువు సోమవారం వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ అలివేలమ్మ ఆదివారం తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఇంకా దాదాపు 50 మందికి నగదు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

ఎగిసిన మంటలు

మద్దికెర: స్థానిక కొత్తపల్లి రోడ్డులోని పాత సినిమా టాకీస్ వద్ద ఆదివారం ఆకతాయిలు కంపచెట్లకు నిప్పుపెట్టడంతో మంటలు ఎగిసిపడ్డాయి. సమీపంలోనే పశుగ్రాసం వాములు ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన యువకులు నీటిని చల్లి మంటలను ఆర్పేయడంతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: స్మైల్ ప్లీజ్ అని చెబుతూ కెమెరాలో అందమైన ఫొటోలను క్లిక్‌మనిపించే ఫొటోగ్రాఫర్ల వెనుక ఉన్న కష్టాలు తనకు తెలుసునని, వారికి అండగా ఉండేందుకు తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కెమిస్ట్ భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఫొటో, వీడియో గ్రాఫర్ల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఫొటో, వీడియోగ్రాఫర్లు తీసే ఫొటోలు, వీడియోలు ఎప్పటికీ చెదిరిపోని జ్ఞాపకంలాంటివన్నారు. మారుతున్న టెక్నాలజీతో ఈ వృత్తుల వారి జీవనం కష్టతరమైందని అన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని కొత్త కొత్త ఆవిష్కరణలు చేసెందుకు శిక్షణ అవసరమని తమ ప్రభుత్వం మరోసారి ఏర్పాటైన తరువాత ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమంపై దృష్టి సారిస్తామని చెప్పారు. అలాగే బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలతో పాటు సంక్షేమ పథకాలు అందించడం, పట్టణంలో ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్‌కు భవనం లేదా స్థల కేటాయింపుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫొటోగ్రాఫర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బీసీ సంఘం జాతీయ నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, అసోసియేషన్ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి



వెల్దుర్తిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పారిపాలన సాగిస్తూ అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విన్నవించారు. ఆమె ఆదివారం వెల్దుర్తిలో తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డిలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగనన్న తమ, తర భేదం లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలందించారని, సీఎం సహకారంతో నియోజకవర్గంలో, వెల్దుర్తి మండలంలో అనేక అభివృద్ధి పనులు, ప్రజలకు సౌకర్యాలు కల్పించామని గుర్తుచేశారు. గత టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో అమలుచేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను బేరీజు వేసుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు ఎన్నికలు రావడంతో ప్రజల ఇళ్ల వద్దకు వస్తున్నారని లేకపోతే వచ్చేవారే కాదన్నారు. తాను పలు దఫాలుగా ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశానన్నారు. టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మవద్దని, నెరవేర్చని హామీలు ఎన్నైనా ఇచ్చే అలాంటి వారికి మరోసారి గట్టిగా బుద్ధిచెప్పాలన్నారు. పార్టీలు, కులమతాలకతీతంగా అందరి క్షేమం కోరుతూ సాగిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని, ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా బీవై రామయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో జెడ్పీటీసీ సుంకన్న, వెంకట్‌నాయుడు, ఎంపీటీసీలు దేవమ్మ, చిట్టెమ్మ, బొమ్మన పెద్దిరెడ్డి, ఆరిఫ్, బాలాజీ, శివారెడ్డి, తేజేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి

మద్దికెర: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు తమ కార్యకర్తలకు ఎన్నికల నిబంధనల గురించి వివరించాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా సహకరించాలన్నారు. మండలంలో ఎవరైనా నాటుసారా, కర్ణాటక మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ పొందుపరిచిన నిబంధనల మేరకు అన్ని సక్రమంగా పాటించాలన్నారు. జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, యార్డు చైర్మన్ పక్కీరప్ప, సర్పంచులు విజయుడు, ఆంజనేయులు, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌పై కక్షసాధింపు తగదు

ఎమ్మిగనూరుటౌన్: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు ధోరణి అవలంభిస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు ఖాశీంనాయుడు, గోపినాథ్ పేర్కొన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కేజ్రీవాల్‌ను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీరి దీక్షకు సీపీఐ పట్టణాధ్యక్షుడు రంగన్న, శ్రీను సంఘీభావం తెలిపారు.

14న అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పద్మశ్రీ మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవ సభ నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ కన్వీనర్ ఎస్.దేవసహాయం, చైర్మన్ మాలఉసేని, కో-కన్వీనర్లు ఆనంద్ చైతన్య, కదిరికోట ఆదెన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి దళిత, గిరిజనులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న మాళ మల్లేశ్వరస్వామి

హొళగుంద: ఉమ్మడి జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేవారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

మాట తప్పని నేత సీఎం జగన్



హొళగుంద మాలవీధిలో మాట్లాడుతున్న విరూపాక్షి



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన మల్లికార్జునపల్లి వాసులతో విరూపాక్షి

- హామీలిచ్చి మోసగించడం చంద్రబాబు నైజం
- కుట్రల కూటమిని నమ్మి మోసపోవద్దు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి ఇంటింటి ప్రచారం
- 60 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

హొళగుంద: వైఎస్ జగనన్న చేయగలిగేవి మాత్రమే చెప్తాడు.. చెప్పాడంటే చేసి తీరుతాడు అని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి అన్నారు. ఆయన ఆదివారం హొళగుందలోని అయోధ్యనగర్, దిడ్డి కాలనీ, హాస్పిటల్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అంతకుముందు ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మాలవీధి వాసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విరూపాక్షి మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసినా గుర్తుంచుకునేలా మంచిపని ఒక్కటైనా చేశాడా అని ప్రశ్నించారు. జగనన్న ఐదేళ్ల పాలనలో పాఠశాలలు, హాస్పిటళ్లు, సచివాలయాలు, ఆర్బీకేలతో ఎంతో అభివృద్ధి జరిగిందని వివరించారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని వివరించారు. ఎన్నికల వేళ టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలతో మోసం చేసేందుకు వస్తున్నారని అలాంటివారిని నమ్మవద్దన్నారు. అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సినిమా టాకీసు వీధిలో టీడీపీకి చెందిన 60 కుటుంబాలు ఆ పార్టీని వీడి ఎరుకలి నాగేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి విరూపాక్షి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఈశా, మల్లికార్జున, శేషప్ప, హనుమప్ప, మల్లయ్య, ఎస్కే గిరి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమికి మరో షాక్

ఆలూరు రూరల్: హాలహర్వి మండలం మల్లికార్జునపల్లి గ్రామంలో టీడీపీకి చెందిన నరేష్, పంపాపతి, యోగానంద, రామాంజినేయులు, గోవింద రెడ్డితో పాటు 70 కుటుంబాలు ఆదివారం ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విరూపాక్షి మాట్లాడుతూ.. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ పారదర్శక పాలన అందించిన వైఎస్సార్‌సీపీకి మరోసారి అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జనార్థన్‌నాయుడు, నాయకులు సొమ్యా రెడ్డి, రామిరెడ్డి, మల్లికార్జున, ఓబులేసు ఈరన్న, మారయ్య, మల్లికార్జున, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

చిప్పగిరి: కార్యకర్తలే పార్టీకి కొండంత అండ అని ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి అన్నారు. మండలంలోని నేమకల్లు గ్రామంలో నూతనంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. సర్పంచ్ ప్రేమ్‌కుమార్, నాయకులు దివాకర్ రెడ్డి, సురేష్ రెడ్డి, రంగస్వామి, గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఈత'రం.. జరభద్రం

- నరదా మాటున పొంచిఉన్న ప్రమాదం
- పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి



పెనుమాడలో బావిలో ఈత కొడుతున్న చిన్నారులు

కృష్ణగిరి: మండు వేసవి.. ఉదయం 9 గంటలు దాటితే ఇంట్లో ఉక్కపోత.. బయటకు వస్తే నడినెత్తిన మంట.. అత్యవసర పనిమీద బయటికి వచ్చినా జనాలు బెంబేలెత్తుతున్నారు. ఏప్రిల్ ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎండలు ఏలా ఉంటాయోనని జనం ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నమైతే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవిలో సాధారణంగా ఎక్కువ మందిని ఇబ్బందులకు గురిచేసేది వడదెబ్బ. తీవ్ర స్థాయిలో వడదెబ్బ తగిలితే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంది. వేసవి వచ్చిందంటే చిన్నారుల్లో ఎక్కడిలేని ఆనందం ఉంటుంది. ఒంటిపూట బడులు కావడంతో మధ్యాహ్నం నుంచే చెరువులు, కాలువలు, బావుల్లో సరదాగా ఈత కోసం దిగుతున్నారు. ఈతపై అప్రమత్తంగా లేకుంటే తల్లిదండ్రులకు గుండె కోత తప్పదంటున్నారు నిపుణులు.

ప్రమాదాల నివారణ ఇలా..

వేసవిలో చిన్నారులు ఈత నేర్చుకోవడానికి చెరువులు, బావులు, వాగులు, కుంటల్లోకి వెళ్తామంటే తల్లిదండ్రులు వెంటనే అనుమతించకూడదని వారు సూచిస్తున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే ఈత నేర్పాలి. స్నేహితులు, బంధువులు ఇతరులతో ఈతకు పిల్లలను పంపకూడదు. ప్రాక్టీసు లేకుండా స్విమ్మింగ్ పూల్‌లో దూకకూడదు. కుటుంబసభ్యులు తోడు లేకుండా ఒంటరిగా ఈతకు వెళ్లకూడదు. ఒకవేళ ఈదుతున్నప్పుడు నీటి అడుగు భాగంలోకి వెళ్లి మట్టి తీసుకురావడం వంటివి చేయకూడదు. అలాగే తీర్థయాత్రలు, ఇతర ప్రదేశాలకు వెళ్లిన సమయంలో ఈత వచ్చినప్పటికీ నీటిలోకి పిల్లలను ఒంటరిగా పంపకూడదు.

ఇవి పాటిస్తే మంచిది

- ఈత కొట్టేటపుడు అనువైన స్విమ్మింగ్ సూట్ వేసుకోవాలి.
- తల వెంట్రుకలు తడవకుండా మాస్క్ లాంటిది ధరించాలి.
- నీటిలో తడవడం వల్ల చర్మ సంబంధిత వ్యాధులు రాకుండా వాజిలిన్ పూయాలి.
- ముఖాన్ని పైకి ఉంచి ఈదాలి. ఊపిరి పీల్చుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

ఈతకు వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బావి, చెరువులోకి దూకేటప్పుడు కాళ్లు ముందుగా నీళ్లను తాకేలా చూసుకోవాలి. తలకిందులుగా, డైవింగ్‌గా దూకడం ప్రమాదం.
- క్వారీ గుంతల అడుగు భాగంలో బండలు, రాళ్లు ఉంటాయి. ఇలాంటి వాటిలో లోతును ముందుగా అంచనా వేయకపోతే చాలా ప్రమాదం.
- అరగంట కంటే ఎక్కువ సేపు ఈత కొట్టరాదు. గంటల కొద్దీ ఈదడం వల్ల సరిగా ఊపిరాడదు.
- ఈత కొట్టే సమయంలో ఇతరులు మునిగిపోతున్నట్లు గమనిస్తే ఎంతటి నిపుణుడైనా రక్షించేందుకు నీళ్లలోకి దూకకూడదు. కర్రలు, తాడు పరికరాల సాయంతో కాపాడాలి.